సాక్షి
సూర్యాపేట
సోమవారం, 5, ఫిబ్రవరి, 2024



పద్మశ్రీలకు సత్కారం

పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, ఏ.వేలు ఆనందచారిని రాష్ట్ర ప్రభుత్వం సత్కరించింది.

- 8లో



మట్టపల్లిలో విశేష పూజలు

మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం శ్రీలక్ష్మీనరసింహస్వామి వారికి అర్చకులు నిత్యకైంకర్యాలను విశేషంగా నిర్వహించారు.

- 10లో



వేధిస్తున్న ముఠా అరెస్ట్ ?

ప్రేమజంటలను సెల్‌ఫోన్‌లో రహస్యంగా వీడియోలు తీసి వేధిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు.

- 10లో

న్యూస్‌రీల్

రేపు డీడీఓలకు సెమినార్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఈనెల 6న ఉదయం 11 గంటలకు సూర్యాపేట కలెక్టరేట్‌లో ఆదాయ పన్ను శాఖ హైదరాబాద్ ఆధ్వర్యంలో ట్యాక్స్ డెడికేటెడ్ ఎట్ సార్స్ (టీడీఎస్)పై జిల్లాలోని డ్రాయింగ్ డిసబర్స్‌మెంట్ అధికారు(డీడీఓ)లకు సెమినార్ నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎస్.వెంకట్రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెమినార్‌కు డీడీఓలు విధిగా హాజరుకావాలని కోరారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న చిన్నవెంకటేశ్వర్లు

హుజూర్‌నగర్: నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జానకి చిన్నవెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా హుజూర్‌నగర్ డివిజన్ నూతన కమిటీ ఎన్నిక, ఉద్యోగ ఓటర్లపై, ఏడు మండలాల్లో ఉన్న నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి పి.పుల్లయ్య, నాయకులు సునిల్, మంగయ్య, వెంకటేశ్వర్లు, నాగుల్ మీరా, నర్సింహ పాల్గొన్నారు.

12న నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక

నేరేడుచర్ల: ఈనెల 12న నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల అధికారి పార్థసారధి ఉత్తర్వులు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది జనవరి 23న మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబుపై బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఎం కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో చైర్మన్ పదవి ఖాళీ ఏర్పడిందని, అలాగే గత నవంబర్‌లో మున్సిపల్ వైస్ చైర్మన్ వల్లా శ్రీలతారెడ్డి రాజీనామా చేయడంతో ఆ పదవీ ఖాళీగా ఉందని పేర్కొన్నారు. ఈ రెండు పదవుల ఎన్నికకు నోటీఫికేషన్ జారీ అయిందని తెలిపారు. ఈ 10న మున్సిపల్ సభ్యులందరికి సమావేశ నోటీసును జారీ చేయాలని, 12న ఉదయం 11గంటలకు జిల్లా కలెక్టర్ సమక్షంలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

'వేములూరు'కు నీటి విడుదల



కాలువలో పారుతున్న నీరు

మఠంపల్లి: మండలంలోని యాతవాకిల్ల వద్ద గల వేములూరు రిజర్వాయర్‌కు ఆదివారం సాగర్ ఎడమ కాలువ పానుగోడు ఎస్కేప్ నుంచి సాగునీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. రిజర్వాయర్ పరిధిలో వరిపొలాలకు నీరు అందక ఎండిపోతున్నాయని, ఇటీవల మఠంపల్లి మండలానికి వచ్చిన భారీ నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి విన్నవించడంతో సాగునీరు విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

భగవద్గీత సారాన్ని ప్రజలకు తెలియపర్చాలి



మనోహర్‌దాస్ గురుజీని సత్కరిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్, అర్చకులు

మఠంపల్లి: హిందూ ధర్మంతోపాటు భగవద్గీతా సారాన్ని ప్రజలకు తెలియజేయాలని ప్రముఖ హిందూధర్మ ప్రచార సారధి, భగవద్గీత ప్రచారకర్త రాధా మనోహర్‌దాస్ గురుజీ అన్నారు. మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రాన్ని ఆదివారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఆయనను ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు మట్టపల్లిరావు, అర్చకులు సాదరంగా ఆలయంలోకి ఆహ్వానించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మనోహర్‌దాస్ గురుజీ మాట్లాడారు. కార్యక్రమంలో అర్చకులు లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు పాల్గొన్నారు.

ఉచిత సేవకూ పైసలే!

పేట జనరల్ ఆస్పత్రిలో వసూలు

- ప్రతిదానికి డబ్బులు డిమాండ్ చేస్తున్న సిబ్బంది
- మగబిడ్డ పుడితే రూ.వెయ్యి, ఆడబిడ్డకు రూ.500
- క్షతగాత్రులకు కట్టు కడితే రూ.200 నుంచి మొదలు..
- పట్టించుకోని ఆస్పత్రి అధికారులు



సూర్యాపేటలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

ఇటీవల జాజిరెడ్డిగూడెం మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మగబిడ్డకు జన్మనిచ్చింది. దీంతో సదరు మహిళ బంధువుల నుంచి ఆస్పత్రిలో పనిచేస్తున్న ఆయాలు రూ.వెయ్యి, ఇతర సిబ్బంది మరో రూ.వెయ్యి వరకు వసూలు చేశారు. ఈ ఆస్పత్రిలో కాన్పుకు వచ్చే మహిళలతోపాటు ఇతర సేవలు పొందే ప్రతిఒక్కరి వద్ద సిబ్బంది ఇలాగే వసూలు చేయడం పరిపాటిగా మారింది.

సూర్యాపేట: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో రోగులకు ఉచితంగా అందించాల్సిన వైద్యసేవలు పైసలిస్తేనే అందుతున్నాయి. ఆస్పత్రిలో పనిచేసే స్వీపర్ల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. జిల్లాలోని పేద వర్గాలకు ఈ హాస్పిటలే పెద్దదిక్కు. ఎలాంటి ప్రమాదం జరిగినా, కాన్పులు చేయించుకుకోవాలన్నా ఇక్కడికే జనం ఇక్కడికే వస్తున్నారు. ఒక్క సూర్యాపేట నియోజకవర్గం నుంచే కాకుండా కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి నియోజకవర్గాల నుంచి పేద కుటుంబాలకు చెందిన వేలాది మంది నిత్యం ఈ ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్నారు. కాన్పుల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వ హాస్పిటల్‌లో చేరి వైద్యసేవలు పొందుతున్నారు. రోగ నిర్ధారణ కోసం వైద్యులు సీటీ స్కాన్, అల్ట్రాసౌండ్‌తోపాటు పలు రకాల పరీక్షలు ఉచితంగా అందిస్తున్నప్పటికీ ప్రతిచోట సిబ్బంది డబ్బులు వసూలు చేయడమేంటని రోగుల బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఫిర్యాదులు అందగానే చర్యలు తీసుకుంటున్నట్లు హడావుడి చేస్తున్న హాస్పిటల్ అధికారులు ఆ తరువాత పట్టించుకోని పరిస్థితి నెలకొనడంతో ఈ తంతు నిత్యకృత్యంగా కొనసాగుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

కాన్పుకు వెళితే రూ.2వేలకుపైనే ఖర్చు

జిల్లాలో ప్రస్తుతం 60 శాతానికిపైగా ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరుగుతుండగా ఇందులో ఎక్కువశాతం జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో చేస్తున్నారు. అయితే ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఫీజుల దోపిడీకి బయపడి ప్రజలు పేట ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే కాన్పు అయిన మహిళ ఇంటికి వెళ్లే సరికి రూ.2 వేలకు పైగానే సిబ్బంది వసూలు చేస్తున్నట్టు సమాచారం. పుట్టిన బిడ్డను శుద్ధిచేసి అందిచే ఆయాలు మగబిడ్డ అయితే రూ.వెయ్యి, ఆడబిడ్డకు అయితే రూ.500 బహిరంగానే వసూలు చేస్తున్నారు. నర్సులు, రూమ్ క్లీన్ చేసే సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు ఇలా ప్రతి ఒక్కరూ రూ.200 వరకు ఇస్తేనే పని చేస్తున్నారు. పైసలివ్వలేదంటే చీదరించుకుంటున్నారని బాధితులు అంటున్నారు.

నామమాత్రంగానే చర్యలు..

ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బంది ప్రతి పనికి పైసలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కొత్తేమి కాదు. గతంలో ఇలాంటి ఆరోపణలు పలుమార్లు రాగా ఒక్కరిద్దరు సిబ్బందిని తాత్కాలికంగా తొలగించారు. అయినా మిగతా వారితోపాటు మళ్లీ విధుల్లో చేరిన వారిలో ఎలాంటి మార్పు రాలేదు. అయితే ఆస్పత్రి సిబ్బంది పని తీరుపై పర్యవేక్షణ లేక పోవడంతోనే రోగుల నుంచి విచ్చలవిడిగా డబ్బులు వసూలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఒక్కో పనికి ఒక్కోరేటు

ఆస్పత్రిలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం రూ.200, ఫిజికల్ ఫిట్నెస్ ధ్రువీకరణ పత్రం జారీకి రూ.300 నుంచి రూ.500 వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. క్షతగాత్రులు ఆస్పత్రికి వస్తే కట్లు కట్టే సిబ్బంది కట్టును బట్టి రూ.200 నుంచి వరకు వసూలు చేస్తున్నట్టు సమాచారం. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళితే వేల రూపాయలు చెల్లించాల్సిన సేవలను తాము ఉచితంగా చేస్తుంటే మాకు మాత్రం కాసిన్ని డబ్బులు ఇవ్వరా అని సిబ్బందే అంటున్నారని రోగల బంధువులు వాపోతున్నారు.

అదనపు బాదుడు

- ట్రాన్స్‌పోర్ట్, సర్వీస్ చార్జీల పేరుతో గ్యాస్ ఏజెన్సీల దోపిడీ
- నెలకు సుమారు లక్ష సిలిండర్ల సరఫరా
- ఒక్కో సిలిండర్‌పై అదనంగా రూ.30 వరకు వసూలు
- ఏడాదికి రూ.3.60 కోట్లు దండుకుంటున్న వైనం
- ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామంటున్న అధికారులు



దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు డెలివరీ దందా సాగిస్తున్నారు. ప్రజలకు భారం అనిపించకుండా ఒక్కో సిలిండర్‌పై రూ.30 నుంచి రూ.40 వరకు అధికంగా వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం సిలిండర్ రీఫిల్లింగ్ ఖరీదు రూ.976 ఉండగా ఇందులోనే ప్రభుత్వం ఏజెన్సీల కమీషన్, డెలివరీ చార్జీలు, అందిస్తున్న రాయితీ కలిపి వసూలు చేస్తోంది. అయితే ఏజెన్సీలు మాత్రం ప్రతి సిలిండర్‌కు రూ.1,010 నుంచి రూ.1,020 వరకు వసూలు చేస్తున్నారు. జిల్లాలో ఇండియన్ ఆయిల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ కంపెనీలకు చెందిన డిస్ట్రిబ్యూటర్లు ప్రజలకు గ్యాస్ సిలిండర్లను సరఫరా చేస్తున్నారు. ప్రతి ఏజెన్సీ నిర్వాహకులు దూరంతో సంబంధం లేకుండా అధిక వసూలుకు పాల్పడుతున్నారనేది బహిరంగ రహస్యమే. జిల్లా వ్యాప్తంగా 2,93,766 గ్యాస్ కనెక్షన్లు ఉండగా సుమారు నెలకు లక్ష సిలిండర్లు సరఫరా అవుతున్నట్లు సమాచారం. సరాసరి ప్రతి సిలిండర్‌పై రూ.30 అధికంగా వసూలు చేస్తే ఏడాదికి రూ.3.60కోట్ల దందా నడుస్తోన్నట్టు తెలుస్తోంది.

గ్యాస్ కనెక్షన్లు ఇలా..

జిల్లాలో మూడు కంపెనీలకు చెందిన 13 సాధారణ డిస్ట్రిబ్యూటర్లు, 12 గ్రామీణ విత్రక్ డిస్ట్రిబ్యూటర్లు ఉన్నారు. 25 ఏజెన్సీల పరిధిలో 1,66,508 సింగిల్ సిలిండర్ కనెక్షన్లు, 50,032 డబుల్ సిలిండర్ కనెక్షన్లు, 11,851 దీపం కనెక్షన్లు, 51,359 సీఎస్ఆర్‌తో కలిపి మొత్తం 2,79,750 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. పట్టణాల్లో ఒక కుటుంబానికి నెలకు ఒక సిలిండర్ అవసరం పడుతుండగా గ్రామాల్లో మూడు నెలలకు ఒక సిలిండర్ వాడుతున్నట్లు తెలుస్తోంది.

నిబంధనల ప్రకారమైతే..

ఇండియన్ ఆయిల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ కంపెనీలకు చెందిన డిస్ట్రిబ్యూటర్లు నిబంధనల ప్రకారం ప్రజల నివాసాలకు దూరంగా గోదాములు ఏర్పాటు చేసుకొని సిలిండర్లు సరఫరా చేయాలి. సాధారణ డిస్ట్రిబ్యూటర్లు తమ గోదాము పరిధిలో చుట్టూ 5 కిలోమీటర్ల దూరం వరకు సిలిండర్ ఖరీదుపై అధికంగా వసూలు చేయకుండా అందించాలి. గోదాము వద్దకు లబ్ధిదారులు వెళ్లి సిలిండర్ తీసుకున్నట్లయితే ఖరీదుపై రూ.12 లబ్ధిదారునికి తగ్గించి అందించాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 0 నుంచి 5 కిలోమీటర్లలోపు సరఫరాకు ఎలాంటి అధిక చార్జీ చెల్లించాల్సిన అవసరం లేదు. అదేవిధంగా 6 కిలోమీటర్ల నుంచి 30 కిలోమీటర్ల వరకు సిలిండర్ సరఫరా చేస్తే 10 రూపాయంలు, 30 కిలోమీటర్ల కంటే అధిక దూరం సరఫరా చేస్తే రూ.15 అధికంగా తీసుకోవాలి. ప్రభుత్వం ప్రతి సిలిండర్‌కు ఖరీదులోనే డెలివరీ చార్జీలు, ఏజెన్సీ కమీషన్, లబ్ధిదారునికి అందించే సబ్సిడీ అన్ని కలిపి ప్రతినెలా ఖరీదును నిర్ణయిస్తుంది. ఏజెన్సీ నిర్వాహకులు డెలివరీ బాయ్స్‌కి జీతాలు అందించాలే తప్ప ప్రజలనుంచి కమీషన్ వసూలు చేయడానికి వీలు లేదు. అయినప్పటికీ ట్రాన్స్‌పోర్ట్, సర్వీస్ చార్జీల పేరుతో అదనపు వసూలుకు పాల్పడుతున్నాయి. అయితే జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు మాత్రం ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటామని అంటున్నారు.

అదనంగా వసూలు చేస్తే చర్యలు తప్పవు

గ్యాస్ సిలిండర్‌పై ప్రభుత్వం నిర్దేశించిన ధర కంటే అదనంగా వసూలు చేస్తే సంబంధిత ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటాం. గతంలో వచ్చిన ఫిర్యాదుల మేరకు ఏజెన్సీ నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి హెచ్చరించాం. అదనంగా వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వస్తే తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– మోహన్‌బాబు, డీఎస్ఓ, సూర్యాపేట

• ఆందోళన



భువనగిరిలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై ఆదివారం జిల్లా కేంద్ర ఆస్పత్రి ఎదుట ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు, రాజకీయ నాయకులు



ఆస్పత్రిలో రోదిస్తున్న విద్యార్థినుల స్నేహితులు

వర్ధెల్లి రాములు సేవలు మరువలేనివి



కొత్తగూడెంలో జరిగిన వర్ధెల్లి రాములు సంతాప సభలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

- సీపీఎం నేత జూలకంటి రంగారెడ్డి

తుంగతుర్తి: సీపీఎం సీనియర్ నాయకుడు వర్ధెల్లి రాములు.. పార్టీకి చేసిన సేవలు మరువలేనివని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం తుంగతుర్తి మండలం కర్విరాల కొత్తగూడెం గ్రామంలో జరిగిన వర్ధెల్లి రాములు సంతాప సభలో పాల్గొని మాట్లాడారు. నాటి వీర తెలంగాణ సాయుధ పోరాటంలో కొత్తగూడెం గ్రామస్తుల పాత్ర ఎలకట్టలేనిదన్నారు. భీంరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, మారోజు వీరన్న, భీంరెడ్డి కుశలవరెడ్డి, వర్ధెల్లి బుచ్చిరాములు వంటి మహానాయకులకు జన్మనిచ్చిన గ్రామం కొత్తగూడెం అని కొనియాడారు. కొత్తగూడెంలో సీపీఎం బలోపేతానికి వర్ధెల్లి రాములు ఎనలేని కృషి చేశారన్నారు .ఎన్ని ఇబ్బందులు ఎదురైనా కడవరకు ఎర్రజెండాను భుజాన వేసుకొని గ్రామంలో రైతులు, కూలీల హక్కుల కోసం పోరాడారని గుర్తు చేశారు. అమరవీరుల త్యాగాలను నేటితరం యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం వర్ధెల్లి రాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, నాయకులు కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, కోట గోపి, కందాల శంకర్‌రెడ్డి, పులుసు సత్యం, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఎల్గూరి గోవింద్, మల్లు కపోతంరెడ్డి, అయోధ్య, మూరగుండ్ల లక్ష్మయ్య, తాటి విజయమ్మ, తాటికొండ సీతయ్య, మట్టపల్లి శ్రీశైలం, కన్నె వీరయ్య, దేగల జనార్దన్, అబ్బగాని భిక్షం, మడ్డి అంజిబాబు, కిషన్‌రావు, ముత్తయ్య, పల్లా సుదర్శన్, విష్ణుమూర్తి, ఎల్లయ్య, మల్లయ్య, సోమయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు బుచ్చిరాములు



బుచ్చిరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి: ఎర్రజెండా చేతబట్టి జీవితాంతం పేదల పక్షాన పోరాడిన యోధుడు వర్ధెల్లి బుచ్చిరాములు అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. సీపీఎం సీనియర్ నేత వర్ధెల్లి బుచ్చిరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నెమ్మాది మాట్లాడుతూ బుచ్చిరాములు పేద కుటుంబంలో పుట్టి చిన్నతనంలోనే పోరాటాలకు దగ్గరయ్యారన్నారు. సూర్యాపేట ఆఫీస్ కార్యదర్శిగా పనిచేసి కొద్ది కాలంలోనే తుంగతుర్తి, సూర్యాపేట ఉమ్మడి డివిజన్ వ్యాప్తంగా ఉద్యమాలు నిర్మించారని గుర్తు చేశారు. 1989, 95 మధ్య కాలంలో సూర్యాపేట తాలూకాలో జరిగిన నిర్బంధాలు, హత్యలు, దాడులు, దౌర్జన్యాలను ఎదుర్కోవడంలో, కార్యకర్తలకు మనో ధైర్యం కల్పించడంలో బుచ్చిరాములు పాత్ర మరువలేనిదన్నారు. పేద కుటుంబాల నుంచి వచ్చిన కార్యకర్తలకు కన్న తండ్రిలాంటి వారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కె.యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఎలుగూరి గోవింద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రాములు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు, బొమ్మిడి లక్ష్మీనారాయణ, వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు వజ్జె వీరయ్య, మామిడి సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షకు 96 శాతం మంది హాజరు

నడిగూడెం: సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఆదివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ఎస్సీ గురుకులాల సంస్థ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ హెచ్.అరుణకుమారి తెలిపారు. ఈ సందర్భంగా నడిగూడెంలో ఆమె మాట్లాడుతూ మొత్తం 25 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా 10,301 మంది విద్యార్థులకు గాను 9,920 మంది హాజరు కాగా 381 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మొత్తంగా 96 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో అడ్మిషన్ల కోసం ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు ఆమె పేర్కొన్నారు.

చెస్ పోటీలతో విద్యార్థుల్లో మేధాశక్తి



చెస్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కృపాకర్

సూర్యాపేట టౌన్: చెస్ ఆడడం ద్వారా విద్యార్థుల్లో మేధాశక్తి పెంపొందుతుందని చెస్ అసోసియేషన్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు గండూరి కృపాకర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కిరాణ మర్చంట్ అసోసియేషన్ భవన్‌లో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లోనూ రాణించేలా ప్రోత్సహించాలన్నారు. విజేతలకు నగదు బహుమతులతోపాటు షీల్డులు అందజేశారు. బాలుర విభాగంలో ఎస్.ప్రణీత్, రాహుల్, వివేక్, శ్రీవాస్తవలు, బాలికల విభాగంలో చిద్విలాసిని, వర్షిణి, మేఘనలు ప్రథమ బహుమతులు గెలుచుకున్నారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సాయికుమార్, ప్రధాన కార్యదర్శి ఎల్.సతీష్‌కుమార్, లింగారెడ్డి, మురళి, కవిత, వరప్రసాద్, రవి, కరుణాకర్, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయితీ గడువు పొడిగింపు

- వాహనాల ఈ–చలాన్ చెల్లింపులకు మరో అవకాశం
- 15వ తేదీ వరకు గడువు పెంచిన ప్రభుత్వం
- రాయితీని వినియోగించుకున్నది 39 శాతం లోపే..



సూర్యాపేటలో వాహన తనిఖీ చేస్తున్న పోలీసులు

ఈ–చలాన్ పెండింగ్ కేసులు **6,44,862**	చెల్లించాల్సిన జరిమానా రూ.**19**కోట్లు
చెల్లించిన మొత్తం రూ.**2.18**కోట్లు	రాయితీతో లబ్ధిపొందినవారు **2,50,883**

తిరుమలగిరి (తుంగతుర్తి): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు ఈ–చలాన్ రూపంలో విధించిన జరిమానాల చెల్లింపులపై ప్రభుత్వం ప్రకటించిన రాయితీ గడువును మరోసారి పొడిగించింది. ఈ రాయితీ అవకాశాన్ని జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 38.90 శాతం మంది వాహనదారులు వినియోగించుకోగా వేలాది మందికి కేసుల నుంచి విముక్తి లభించింది.

రెండేళ్ల క్రితమే రాయితీ అవకాశం

2022 మార్చిలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఈ–చాలాన్ జరిమానాలపై రాయితీ ప్రకటించింది. దీంతో కొంతమంది వాహనదారులు ఆ సౌకర్యాన్ని వినియోగించుకొని ప్రయోజనం పొందారు. ప్రస్తుతం నూతన సర్కార్ సైతం పెండింగ్ ఈ–చాలాన్ జరిమానాలపై రాయితీ ప్రకటించింది. డిసెంబర్ 22 నుంచి రాయితీతో కూడిన ఈ–చలాన్ జరిమానాలు చెల్లించాలని కల్పించింది. దీంతో పోలీస్ శాఖ తొలుత జనవరి 10 వరకు గడువు విధించారు. అయితే స్పందన అంతంత మాత్రంగానే ఉండడంతో గడువును మరోసారి జనవరి 31 వరకు పెంచారు. అయినప్పటికీ అనుకున్న స్థాయిలో పెండింగ్ ఈ–చలాన్ జరిమానాలు చెల్లించకపోవడంతో రెండోసారి ఫిబ్రవరి 15 వరకు గడువు పొడిగించారు.

వాహనాల వారీగా రాయితీ ఇలా..

వన్‌టైం సెటిల్మెంట్‌లో భాగంగా ద్విచక్ర వాహనదారులు 20 శాతం, ఆర్టీసీ బస్సులు, తోపుడు బండ్లు 10శాతం, నాలుగు చక్రాల వాహనాలు, కార్లు 40 శాతం, లారీలు, భారీ వాహనాల వారు 50 శాతం చెల్లించి కేసుల నుంచి ఉపశమనం పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. రహదారి ఉల్లంఘనలకు పాల్పడిన వాహనదారులపై పోలీసులు విధించిన జరిమానాలో రాయితీ పోను ఈ మేరకు చెల్లించడానికి అవకాశం ఉంది.

ఫిబ్రవరి 3వ తేదీ వరకు..

2023 డిసెంబర్ 22 నుంచి ఈ జరిమానా కేసులు పరిగణనలోకి తీసుకుంటే ఫిబ్రవరి 3 తేదీ వరకు రాయితీ అవకాశాన్ని 38.90 శాతం మంది వాహనదారులు వినియోగించుకున్నారు. మరో 61.10 శాతం మంది రాయితీ అవకాశాన్ని వినియోగించుకోలేదు. గడువు పొడిగించడంతో ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

వసూలుకు ప్రత్యేక తనిఖీలు

రహదారి నిబంధనలు పాటించని వాహనాలను గుర్తించడానికి పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. ఇది వరకే పెండింగ్ ఈ–చాలాన్‌లు ఉండి చెల్లించని వారిని గుర్తిస్తూ ప్రభుత్వం ప్రకటించిన రాయితీని వినియోగించుకొని జరిమానాలు చెల్లించి లబ్ధి పొందాలంటూ అవగాహన కల్పిస్తున్నారు. జరిమానాలు ఉన్న వాహనాలను స్వాధీనం చేసుకొని జరిమానాలు చెల్లించిన అనంతరం విడుదల చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన రాయితీ అవకాశంతో ఇప్పటి వరకు పెండింగ్ ఈ–చలాన్ జరిమానా చెల్లించని వాహనదారులకు కొంత వరకు ఊరట లభిస్తోంది.

క్లుప్తంగా

మట్టపల్లి అర్చకుడికి అవార్డు ప్రదానం



ఫణిభూషణ మంగాచార్యులను సత్కరిస్తున్న రుద్రాక్షవైభవం పీఠం సభ్యులు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో అర్చకులుగా పని చేస్తున్న ఫణిభూషణమంగాచార్యులుకు ఆలయ ప్రతిష్ట వైభవ బ్రహ్మ అవార్డు దక్కింది. ఆదివారం తిరుపతి వెంకటేశ్వర యూనివర్సిటీ ఆడిటోరియంలో సర్‌సీవీ రామన్ అకాడమీ సంస్కృత సేవాసంస్థ, రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం వారు ఉగాది పురస్కారములలో భాగంగా ఆయనను అవార్డుతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనను సువర్ణ కంకణం, గోల్డ్ మెడల్‌తో ఘనంగా సన్మానించారు.

నేరేడుచర్ల లయన్స్‌క్లబ్‌కు అవార్డు



లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డిని అభినందిస్తున్న పాటిహిల్

నేరేడుచర్ల : రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సేవలు అందిస్తున్న నేరేడుచర్ల లయన్స్‌క్లబ్‌కు అవార్డు దక్కింది. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు పాటిహిల్ ప్రశంసాపత్రాన్ని క్లబ్ అధ్యక్షులు చల్లా ప్రభాకర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు బట్టు మధు, సుంకరి క్రాంతికుమార్, శ్రీనివాస్‌రెడ్డి, జిలకర రామస్వామి, డిస్ట్రిక్ గవర్నర్ శివప్రసాద్, వైస్ డిస్ట్రిక్ గవర్నర్ ప్రభాకర్‌రెడ్డి, మల్టిపుల్ చైర్ పర్సన్ తీగల మోహన్‌రావు తదితరులున్నారు.

యువకుడి మృతి

చిట్యాల: చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. తుంగతుర్తి మండలం కేతేపల్లి గ్రామానికి చెందిన గూడపూరి ప్రశాంత్(28) బైక్‌పై తన స్వగ్రామం కేతేపల్లి నుంచి హైదరాబాద్‌కు వెళుతున్నాడు. మార్గమధ్యలో చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులోకి రాగానే ఆ వెనకే హైదరాబాద్ వైపునకు వెళుతున్న డీసీఎం ప్రశాంత్ ప్రయాణిస్తున్న బైక్‌ను వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రశాంత్ అక్కడిక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ-2 నవీన్‌కుమార్ తెలిపారు.

చట్ట సభల్లో బీసీలవాటా సాధించాలి

మోత్కూరు : మహాత్మా జ్యోతిరావు పూలే స్ఫూర్తితో చట్ట సభల్లో బీసీల వాటా సాధించాలని ఆలిండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ పిలుపునిచ్చారు. చట్ట సభల్లో బీసీల వాటా సాధించడానికి తలపెట్టిన మహా పాద యాత్ర విజయవంతం చేయడం కోసం మూడవ రోజుకొనసాగుతున్న సన్నాహక యాత్రలో భాగంగా ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రంలో వివిధ బీసీ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర నాయకులు అవిశెట్టి అవిలుమల్లు, బయ్యని రాజు, కలిమెల నర్సింహ్మా, బుంగ యాదయ్య, బొడ్డుపల్లి మైసయ్య, గడ్డమీది రమేష్ గౌడ్, గనగాని నర్సింహ్మా, సజ్జనం మనోహర్‌లు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఓబీసీ వైస్ చైర్మన్లు వెలుగు వనిత, పటేల్ వనజ పాల్గొన్నారు.

అట్టుడికిన భువనగిరి

- బాలికల మృతికి హాస్టల్ వార్డెన్, ఆటో డ్రైవర్, పీఈటీనే కారణమని మృతుల కుటుంబ సభ్యుల ఆరోపణ
- న్యాయ విచారణ జరిపించాలని ధర్నా, రాస్తారోకో
- మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి, స్వస్థలాలకు తరలింపు



భువనగిరిలోని ఎస్సీ బాలికల హాస్టల్ భవనం వద్ద ఆందోళన చేస్తున్న మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు, వివిధ సంఘాల నాయకులు



జిల్లా కేంద్ర ఆస్పత్రి వద్ద ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు

భువనగిరి క్రైం : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై న్యాయ విచారణ జరిపించాలని మృతుల కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు, పలు రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో హాస్టల్ ఎదుట, జిల్లా ఆస్పత్రి వద్ద ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించారు. బాలికలది ఆత్మహత్య కాదని హత్యేనని మృతుల కుటుంబ సభ్యులు ఆరోపించారు. అందుకు హాస్టల్ వార్డెన్, ఆటోడ్రైవర్, పీఈటీనే కారణమని, వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

పేద కుటుంబానికి చెందిన విద్యార్థులే..

జనగాం జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం చిలుపూరి గ్రామానికి చెందిన గాదె నాగరాజు, రజిని దంపతులకు కుమారుడు, కుమార్తెలు ఉన్నారు. ఎనిమిది సంవత్సరాల క్రితం నాగరాజు భార్య రజిని ఆత్మహత్య చేసుకుంది. ఐదేళ్ల క్రితం కుమారుడు మనోజ్ ఇంటి ఆవరణలో నీటి సంపులో పడి మృతిచెందాడు. ఆ తర్వాత నాగరాజు కుమార్తె వైష్ణవి(15)ని తీసుకుని హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. హబ్సిగూడాలో అద్దె ఇంట్లో నివాసం ఉంటూ వైష్ణవిని గత 7 సంవత్సరాల క్రితం భువనగిరి పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో అడ్మిషన్ తీసుకున్నారు. అప్పటి నుంచి వైష్ణవి ఇదే హాస్టల్‌లో ఉంటూ ప్రస్తుతం పదవ తరగతి చదువుతుంది. విద్యార్థిని తండ్రి హైదరాబాద్‌లోని హబ్సిగూడాలో దుస్తువులను ఇస్త్రీ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయన ప్రస్తుతం దివ్యాంగుడు. గతంలో భార్య, కుమారుడి, ప్రస్తుతం కుమార్తెను కోల్పోయి ఏకాకిగా మిగిలాడు.

మేస్త్రీ పనిచేస్తూ...

వరంగల్ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం బుదారావుపేట గ్రామానికి చెందిన కోడి కృష్ణ, లలిత దంపతుల ఏకైక కుమార్తె భవ్య(15)ను 6 సంవత్సరాల క్రితం పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో 5వ తరగతిలో చేర్పించారు. మృతురాలి తండ్రి హైదరాబాద్‌లోని హబ్సిగూడాలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. మేస్త్రీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆర్థికస్తోమత లేకపోవడంతో కుమార్తెను ఎస్సీ హాస్టల్‌లో ఉంచి చదివిస్తున్నాడు.



రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

చిన్నప్పటి నుంచే స్నేహితులు

ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి హైదరాబాద్‌కు వలస వెళ్లిన ఇద్దరు విద్యార్థినుల కుటుంబ సభ్యులు హబ్సిగూడాలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఆయా కుటుంబాలకు చెందిన బాలికలను విద్య కోసం భువనగిరి పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో చేర్పించినప్పటి నుంచి స్నేహితులుగా మారారు. వీరి మధ్య సుమారు 6 సంవత్సరాల స్నేహం ఉంది. వసతి గృహంలో ఉంటూ అక్కడి నుంచి వారు చదువుకునే బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల సుమారు ఒక కిలోమీటర్ వరకు ఉంది. దీంతో విద్యార్థినీలు అక్కడి నుంచి పాఠశాలకు నిత్యం ఆటోలో పాఠశాలకు వెళ్తుంటారు. పాఠశాల సమయం ముగిసిన తర్వాత అదే ఆటోలో తిరిగి వసతి గృహానికి చేరుకుంటారు.

విద్యార్థినుల మృతదేహాలపై గాయాలు

ఎస్సీ హాస్టల్ విద్యార్థినులు భవ్య, వైష్ణవి మృతదేహాలపై తీవ్రమైన గాయాలు, వాతలు, పండ్లతో కొరికిన గాయాలు ఉన్నట్లు భవ్య సోదరి కృష తెలిపారు. వార్డెన్ పీఈటీ, ఆటో డ్రైవర్ అంజనేయులు, వంట మనిషిని విచారించి వారిపై చర్య తీసుకోవాలని కోరారు. పోస్టుమార్టం రిపోర్టును పోలీసులు భయటపెట్టాలని కోరారు.



వైష్ణవి చేతికి గాయం

మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని..

మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని విద్యార్థి సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు స్థానిక ఎస్సీ హాస్టల్‌తో పాటు జిల్లా కేంద్ర ఆస్పత్రి సమీపంలోని ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. సుమారు మూడు గంటల పాటు ధర్నాలు చేసిన అనంతరం స్థానిక ఏరియా ఆస్పత్రి సమీపంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో సామాజికవేత్త బట్టు రాంచంద్రయ్య, ఐద్వా నాయకురాలు బట్టుపల్లి అనురాధ, పట్టణ టీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఏవి కిరణ్‌కుమార్, కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, అయోధ్య యాదవ్, ఏబీవీపీ నాయకులు సుర్వి మణికంఠ, ఎస్ఎఫ్ఐ నాయకులు వనం రాజు, ఎన్ఎస్‌యూఐ నాయకులు మంగ ప్రవీణ్, లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు సంతోష్ నాయక్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లగొర్ల మోదిరాందేవ్‌లు, పుట్ట వీరేష్, గుండెబోయిన సురేష్‌యాదవ్, కరుణ్ ఉన్నారు.

భారీ బందోబస్తు

ఆందోళనల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఏసీపీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో భువనగిరిలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎసీ హాస్టల్‌తో పాటు జిల్లా కేంద్ర ఆస్పత్రి వద్ద పెద్ద సంఖ్యలో ప్రత్యేక పోలీసు బలగాలను మోహరించారు. ఈ కార్యక్రమంలో సీఐలు సురేష్‌కుమార్, అర్జునయ్య, ఎస్‌ఐలు సంతోష్‌కుమార్, నాగరాజు ఉన్నారు.

స్వగ్రామాల్లో అంత్యక్రియలు

పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థినుల మృతదేహాలకు ఆదివారం సాయంత్రం భువనగిరి ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించగా దహనసంస్కారాల నిమిత్తం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని స్వగ్రామాలకు తరలించారు. అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు.

అధికారుల విచారణ

విద్యార్థినుల ఆత్మహత్యపై పోలీసులు ఉదయం ఎస్సీ హాస్టల్‌లో కుటుంబ సభ్యులు, బంధువుల సమక్షంలో విచారణ చేపట్టారు. ఈ క్రమంలో సఖి సెంటర్, చైల్డ్ లైన్‌కు సంబంధించిన సిబ్బంది పలువురు విద్యార్థినులను విచారించారు. క్లూస్ టీం సిబ్బంది హాస్టల్ గదిలో ఆధారాలు సేకరించారు.

హాస్టల్ ఖాళీ

పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో చోటుచేసుకున్న ఆత్మహత్యల సంఘటన వివరాలను తెలుసుకున్న విద్యార్థినుల కుటుంబ సభ్యులు హాస్టల్‌కు చేరుకున్నారు. హాస్టల్‌లో ఉన్న తమ పిల్లలను స్వగ్రామాలకు తీసుకెళ్లారు.

మిన్నంటిన రోదనలు

చిన్నప్పటి నుంచి ఒకే హాస్టల్‌లో ఉంటూ ఒకే రోజు ఒకే గదిలో విద్యార్థినులు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఈ నెల 3వ తేదీన రాత్రి పొద్దుపోయాక జిల్లా కేంద్ర ఆస్పత్రికి చేరుకున్నారు. రెండు రోజులుగా జిల్లా ఆస్పత్రి ఆవరణతో పాటు ఎస్సీ హాస్టల్ ఆవరణలో సదరు విద్యార్థినుల కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదు

భవ్య మాకు ఫోన్ చేసినప్పుడు హాస్టల్‌కు అర్ధరాత్రి దాటిన తర్వాత కొందరు వ్యక్తులు వస్తున్నారని చెప్పింది. వాళ్లని చూస్తే హాస్టల్‌లో ఉండే సిబ్బంది తమను బెదిరిస్తున్నారని ఫోన్‌లో వివరించింది. హాస్టల్‌లో ఉండాలంటే బయమేస్తుందని చెప్తే ఇంకా నెల రోజులైతే పరీక్షలు పూర్తవుతాయని, అక్కడినుంచి రావచ్చని సర్ది చెప్పాం. ఇంతలోనే భవ్య ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం రావడంతో మేము నమ్మలేదు. భవ్య ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదు. ఆమె హాస్టల్‌లోనే హత్య చేశారు. పోస్టుమార్టంలో అసలు విషయం తెలుస్తుంది.

– పద్మ, మృతురాలి సోదరి

మృతదేహాలను సందర్శించిన ఎమ్మెల్యే, అధికారులు

జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని మార్చురీలో ఉన్న విద్యార్థినుల మృతదేహాలను ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు సందర్శించారు. విద్యార్థినుల మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మృతుల కుటుంబ సభ్యులను ప్రభుత్వం తరపున ఆదుకుంటామని తెలిపారు. మృతుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇంటితో పాటు ఎక్స్‌గ్రేషియా వచ్చే విధంగా కృషి చేస్తానని చెప్పారు. ఒక్కో మృతురాలి కుటుంబానికి రూ.50 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు.



ఆస్పత్రిలో మృతుల కుటుంబ సభ్యులు, బంధువులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

పలువురి అరెస్ట్

మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్ర ఆస్పత్రి వద్ద వరంగల్–హైదరాబాద్ ప్రధాన రహదారిపై విద్యార్థి సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు వారికి నచ్చచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వినిపించుకోలేదు. అక్కడినుంచి పట్టణ శివారులోని బైపాస్ రోడ్డులో రాస్తారోకో చేసేందుకు వెళ్తున్న క్రమంలో సుమారు 10మంది టీఆర్‌ఎస్, యాదవ సంఘ నాయకులతో పాటు మృతుల కుటుంబాలకు చెందిన ఆరుగురు యువతులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం యువతుల పై పోలీసులు దాడి చేసినట్లు ఆరోపిస్తూ జిల్లా కేంద్ర ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఈ సమయంలో మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వసుధ అనే యువతిపై మహిళా పోలీసులు అరెస్టు చేసే క్రమంలో తనపై దాడి చేసినట్లు ఆరోపించింది.



భువనగిరి పట్టణంలో బైపాస్ రోడ్డుపై ధర్నా చేయడానికి వెళ్తున్న మృతుల కుటుంబ సభ్యులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

పద్మశ్రీలకు ప్రభుత్వ సత్కారం



పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన కూరెళ్లను సత్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు



వేలు ఆనందచారిని సన్మానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం, మంత్రులు

రామన్నపేట: పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన మధురకవి డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా సత్కరించింది. ఆదివారం హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో తెలంగాణ భాషా సాంస్కృతిక పర్యాటకశాఖ ఆధ్వర్యంలో సీఎం అనుముల రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీఎస్ శాంతికుమారి ఘనంగా సత్కరించారు. శాలువాతో సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. రూ. 25లక్షల నగదు ప్రోత్సాహకం అందజేశారు. పద్మవిభూషణ్ పురస్కారానికి ఎంపికైన మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, ప్రముఖ సినీనటుడు చిరంజీవిలు కూరెళ్ల కృషిని అభినందించారు.

పద్మశ్రీ వేలు ఆనందచారికి..

యాదగిరిగుట్ట: ఇటీవల పద్మ శ్రీ అవార్డుకు ఎంపికైన ఏ.వేలు ఆనందచారిని హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆర్ అండ్ బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

మర్రిగూడ : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. మర్రిగూడ మండలం రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పగిళ్ల వెంకటేష్(33) తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. గత నెల 24న వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై గ్రామం నుంచి మర్రిగూడకు బయలుదేరాడు. అదే సమయంలో కొట్టాల గ్రామానికి బుర్ర రాజు మద్యం సేవించి బైక్‌పై ఇందుర్తికి చెందిన పదం సత్తయ్య, సరంపేటకు చెందిన జెల్లాకుల యాదయ్యతో కలిసి మర్రిగూడ నుంచి వారి గ్రామాలకు వెళ్తున్నారు. మార్గమధ్యలో రాంరెడ్డిపల్లి, రాజాపేటతండా గ్రామాల మధ్య వెంకటేష్ వాహనాన్ని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వెంకటేష్‌కు తీవ్ర, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ వెంకటేష్ ఆదివారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



కొట్టాలలో ధర్నా చేస్తున్న బంధువులు



వెంకటేష్ (ఫైల్)

కొట్టాలలో మృతదేహంతో ఆందోళన

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వెంకటేష్ మృతదేహాన్ని కొట్టాలలోని రాజు ఇంటి ముందు ఉంచి బంధువులు, గ్రామస్తులు శాంతియుత ఆందోళన చేపట్టారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు విసుగుచెందిన మృతుని బంధువులు న్యాయం జరగకపోవడంతో ఆందోళనకు దిగారు. వెంకటేష్ మృతికి కారణమైన రాజు కుటుంబసభ్యులు తమ ఇంటికి తాళం వేసి గ్రామం నుంచి వెళ్లిపోయారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నాంపల్లి సీఐ ఎ.నవీన్‌కుమార్, స్థానిక ఎస్‌ఐ కె.రంగారెడ్డిలతోపాటు గట్టుప్పల, చింతపల్లి మండలాలకు చెందిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బందోబస్తు నిర్వహించారు.. మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేవిధంగా చొరవ చూపుతామని పోలీసులు చెప్పినా వినిపించుకోలేదు. న్యాయం జరిగేంతవరకు విరమించేదిలేదని, రాత్రి వరకు ఆందోళన కొనసాగించారు.

వేర్వేరు చోట్ల విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

శాలిగౌరారం: వేర్వేరు చోట్ల విద్యుదాఘాతంతో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. శాలిగౌరారం, పెన్‌పహాడ్ మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన జోగు మల్లయ్య(48) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.ఈ క్రమంలో తనకున్న రెండెకరాల్లో వరిపంట సాగుచేశాడు. రోజువారీ మాదిరిగానే మండలంలోని జాలోనిగూడెం శివారులో ఉన్న బావి వద్దకు వెళ్లాడు. విద్యుత్ మోటారు పెట్టేందుకు ప్రయత్నించగా మోటారు పనిచేయడంలేదు. దీంతో విద్యుత్ మోటారుకు విద్యుత్ సరఫరా జరిగే వైర్‌ను పరిశీలిస్తుండగా తెగిన విద్యుత్ వైర్ చేతికి తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆ సమయంలో కొంత దూరంలో గొర్రెలను మేపుతున్న చీమల నరేందర్ దీనిని గమనించి దగ్గరకు వచ్చి పిలిచిన్నా స్పందన లేకపోవడంతో విషయాన్ని జాలోనిగూడెంలోని జమ్ము సతీష్‌కు ఫోన్‌ద్వారా సమాచారం అందించాడు. వెంటనే అక్కడకు చేరుకున్న సతీష్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆఫ్‌చేసి మల్లయ్య దగ్గరకు వెళ్లి చూడగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. దీంతో వెంటనే ఆయన మల్లయ్య కుటింబీకులకు, గ్రామస్తులకు ఫోన్ ద్వారా సమాచారం అందించగా అక్కడికి చేరుకుని రోదించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు జోగు అరవింద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సింగారెడ్డిపాలెంలో మహిళ..

పెన్‌పహాడ్ : విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందింది. పెన్‌పహాడ్ మండలం సింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన వీరబోయిన ధనమ్మ(29) దుస్తులను దండెంపై ఆరవేస్తోంది. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్‌లో సమస్య వలన దండెం తీగకు విద్యుత్ సరఫరా అవడంతో ఆమె విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలు కేకలు వేయడంతో అత్త లింగమ్మ విని పరుగెత్తి తన కోడలు చెయి పట్టుకొని గుంజగా ఆమెకు కూడా విద్యుదాఘాతానికి గురైంది. మృతుడి భర్త గంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి

గుండాల : ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతిచెందింది.ఈ సంఘటన మండలంలోని సీతారాంపురం గ్రామంలో ఆదివారం జరిగింది. సీతారాంపురానికి చెందిన మహిళ కూరపాటి జానకమ్మ (60) గ్రామంలో నడుచుకుంటూ వెళుతుండగా అదే గ్రామానికి చెందిన జోగు స్వామి ట్రాక్టర్‌ను వెనక్కి తీస్తున్న క్రమంలో ట్రాక్టర్ ట్రాలీ జానకమ్మకు తగిలింది. ప్రమాదంలో కింద పడటంతో వెనుక టైరు ఆమెపై నుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడింది. క్షతగాత్రురాలిని ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. జానకమ్మ మత దేహాన్ని ఆలేరు మాజీ శాసన సభ్యురాలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

బీజేపీతోనే కులవృత్తుల అభివృద్ధి



వాటర్‌క్యాన్లు పంపిణీ చేస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు పీవీ శ్యామ్‌సుందర్‌రావు

- పీవీ శ్యాంసుందర్‌రావు

భూదాన్‌పోచంపల్లి : బీజేపీతోనే కులవృత్తుల అభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర నాయకుడు పీవీ శ్యాంసుందర్‌రావు పేర్కొన్నారు. భూదాన్‌పోచంపల్లిలోని రజకవాడలో ఆదివారం నిర్వహించిన రజక వృత్తిదారుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కులవృత్తిదారులు స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ ముద్ర రుణాలు, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన లాంటి పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను రజకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కులవృత్తిదారుల సంక్షేమానికి పాటుపడాలని కోరారు. రజకుల కోసం ధోబిఘాట్ నిర్మించాలని, ఉచిత విద్యుత్, సబ్సిడీ రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో నిర్మిస్తున్న రజక సంఘం భవనానికి తనవంతుగా ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వాటర్‌క్యాన్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దాసరి మల్లేశం, పోతంశెట్టి రవీందర్, నర్ల నర్సింగ్ రావు, ఎన్నం శివకుమార్, చిక్క కృష్ణ, చింతల రామకృష్ణ, కొంతం శంకర్, నోముల గణేశ్, పిట్టల అశోక్, ఉపేందర్, దోర్నాల సత్యం, మేకల చొక్కారెడ్డి, సుశీల, తండ రమేశ్, సత్యనారాయణ, రచ్చ కరుణాకర్, మహేందర్, శ్రవన్, రవి, రజకసంఘం నాయకులు చేరాల నర్సింహ, ఇబ్రహీంపట్నం అంజయ్య, చేరాల చిన్న నర్సింహ, సైదుగాని స్వామి, శేఖర్, ప్రభాకర్, చేరాల రాజు, భీమరాజు, మల్లేశ్, మునిరాజ్, కుమార్, ప్రేమ్‌కుమార్, రాజు, వెంకటేశ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట రూరల్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. యాదగిరిగుట్ట మండలం కాచారంలో జిల్లా రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బీబీనగరం లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బాల, బాలికల సబ్ జూనియర్ రగ్బీ పోటీలు ఆదివారం ముగిశాయి. బహుమతి ప్రధానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలతో మానసిక ఉల్లాసం చేకూరుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామీణ క్రీడలను ప్రోత్సహిస్తుందన్నారు. క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు పేరు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఎడ్ల సుగుణ, కేసరి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రేగు బాలనర్సయ్య, డీవైఎస్ఓ ధనుంజయ్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ స్టాలిన్‌బాబు, దశరథరెడ్డి, జోసెఫ్, రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నం గణేష్, రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి మంగళపల్లి ప్రవీణ్ కుమార్, శ్రీకాంత్, వీరెందర్ తదితరులున్నారు.

విజేతలుగా నిలిచిన జట్లు

బాలుర విభాగం : చాంపియన్ జనగామ, రన్నరప్ రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి.

బాలికల విభాగం : చాంపియన్ మహబూబ్‌నగర్, రన్నరప్ సంగారెడ్డి, తృతీయ స్థానంలో యాదాద్రి భువనగిరి జిల్లా జట్టు నిలిచింది.



బహుమతులు అందజేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

రగ్బీ క్రీడాకారులకు నెల పారితోషికం

యాదాద్రి భువనగిరి జిల్లాలోని రగ్బీ క్రీడాకారులకు తన నెల పారితోషికాన్ని ఇస్తున్నట్లు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రకటించారు. రగ్బీ క్రీడాకారులకు అవసరమైన క్రీడా సామగ్రి, వారి అవసరాలకు ఖర్చు చేయాలని రగ్బీ అసోసియేషన్ సభ్యులకు సూచించారు.